క్లుప్తంగా

నూతన నియామకం



నీరజా రెడ్డి

పీలేరు : రెడ్డి కమ్యూనిటీ పీలేరు నియోజకవర్గ మహిళా కన్వీనర్‌గా మండలంలోని యర్రగుంట్లపల్లెకు చెందిన పి. నీరజరెడ్డి నియమితులయ్యారు. రెడ్డి కమ్యూనిటీ వ్యవస్థాపకులు యర్రపరెడ్డి సురేంద్రరెడ్డి ఆమెకు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెడ్డి కమ్యూనిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

నేడు వ్యాపారులకు అవగాహన సదస్సు

పీలేరురూరల్ : ఏపీఎస్ ఆర్టీసీ పీలేరు డిపో పరిధిలో ఖాళీ జాగాను 15 ఏళ్లకు అద్దెకు తీసుకుని సొంతంగా నిర్మాణం చేపట్టి వ్యాపారం చేసుకోవడానికి వ్యాపారులకు మంగళవారం సాయంత్రం 4 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజా రవాణా అధికారి రాము హాజరవుతారని చెప్పారు. ఆసక్తిగల వ్యాపారులు హాజరు కావాలని కోరారు.

శివాలయంలో కలశ స్థాపన



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

పెద్దతిప్పసముద్రం: స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం జరిగిన కలశ స్థాపన కార్యక్రమం చూపరులను ఆకట్టుకుంది. శివాలయం సేవకులు సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాలను వేద పండితులు కన్నాస్వామి, నవీన్ శర్మ, మణికంఠ,శశి శర్మ దేవతా మూర్తుల ప్రతిమలను ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో పంచామృతాభిషేకం, ఏకవార రుద్రాభిషేకం, అన్నాభిషేకం, వేద పారాయణం,అష్టావధాన సేవ, ప్రాకారోత్సవం,మహా మంగళహారతి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు అన్నదాన సౌకర్యం కల్పించారు.

తిరువణ్ణామలైకి తరలిన బస్సులు

మదనపల్లె సిటీ: పౌర్ణమి పురస్కరించుకుని మదనపల్లె వన్,టు డిపోల నుంచి సోమవారం ఎనిమిది బస్సులు తిరువణ్ణామలైకి వెళ్లాయి. డిపో ఆవరణంలో బస్సుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి పౌర్ణమికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం ఆర్‌సి నిరంజన్ తెలిపారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యాసామగ్రితో విద్యార్థులు, దాతలు జీవీ ప్రసాద్, ప్రసాద్‌రెడ్డి

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం వైఎస్సార్ వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శి పి.ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ వ్యవస్థాపక సభ్యులు జీవీ ప్రసాద్ విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. ముఖ్యఅతిగా పాల్గొన్న ఎంఈఓ రాజగోపాల్ మాట్లాడుతూ గతంలో ఇదే పాఠశాలలో పని చేసిన ప్రసాద్ విద్యార్థులల ఉన్నతి కోసం ఏటా విద్యాసామగ్రిని అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయి రావాలని కోరారు.విద్యార్థులందరికి నోటుపుస్తకాలు,పలకలు, పెన్నులు,పెన్సిళ్లు, విద్యాసామగ్రి అందజేశారు. వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, హెచ్‌ఎం ధనుంజయరెడ్డి, ఉపాధ్యాయులు చౌడప్ప, మాధవి, పాఠశాల కమిటీ చైర్మన్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండపై భక్తుల సందడి

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలిసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో అధిక శ్రావణమాసం సోమవారం భక్తుల సందడి నెలకొంది. పూజారులు ఈశ్వరమ్మ, మల్లికార్జునలు స్వామి వారికి ప్రత్యేక అలంకరణతో అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతపురం, చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లా, అన్నమయ్య జిల్లాల నుంచి భక్తులు పాల్గొనడం విశేషం. పలువురు భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ముద్దలదొడ్డి నేలమల్లేశర స్వామి కళామండలి గంధర్వరెడ్డి ఆధ్వర్యంలో శివకోటి నామస్మరణ జరిగింది. గౌరమ్మగుట్టలో వెలసిన అమ్మవారికి పూజారి శేఖర్ ప్రత్యేక అలంకరణతో పూజలుచేసి భక్తులకు గౌరమ్మతల్లి దర్శనంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి ,ఈవో రమణ, కొండకిట్ట, ఆలయ ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలతో పాటు అన్నసంతర్పణ చేశారు.

సంక్షేమమే లక్ష్యంగా పాలన

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మంచూరు పంచాయతీ సిద్దారెడ్డిగారిపల్లి, పాతమంచూరు, కొత్తమంచూరు గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబంలో లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వ పని తీరుపై ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న వలంటీర్ల వ్యవస్థపై ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలను అందకుండా అడ్డుకునే ప్రయత్నాలు ప్రతిపక్షాలు ఎన్ని చేసినా సీఎం వైఎస్ జగన్ పేదల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. వైస్ ఎంపీపీలు వెంకట్రమణ, కిరణ్ కుమార్, మండల ప్రత్యేక ఆహ్వానితులు నాగరాజా, నాయకులు చిన్నా, శంకర్ రెడ్డి, వెంకటస్వామి రెడ్డి, దేవేంద్ర రెడ్డి, రమేష్, నారాయణ రెడ్డి, రామనాథ, కరుణ, రెడ్డెప్ప, దొరస్వామి, శోభన్ కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, నీళ్లభాస్కర్, శివారెడ్డి, సురేష్ రెడ్డి, రాయుడు, ఆనంద పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న రాకేష్‌రెడ్డి

పీలేరు : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. సోమవారం పీలేరు పట్టణంలోని పద్మావతి నగర్‌లో నిర్వహించిన ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అభీష్టానికి అనుగుణంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. స్థానిక ప్రజల నుంచి వచ్చిన సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. యువ పారిశ్రామిక వేత్త జి.వి. రాకేష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, సర్పంచ్ దండు జగన్ మోహన్‌రెడ్డి, నాయకులు ఎస్.వి. చలపతి, హుమయూన్, ఆనంద్, కృష్ణారెడ్డి, సఫూరా, రాజలక్ష్మీ, మహేశ్వర్‌రెడ్డి, అరుణ, ఉదయ్‌కుమార్, శ్రీనాథరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

పీలేరురూరల్ : పీలేరు పట్టణంలోని బండ్లవంక, కావలిపల్లె, తిరుపతి రోడ్డు మార్గంలో తాగునీటి సమస్య పరిష్కరించామని సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా తెలిపారు. సోమవారం స్కీంబోరుకు రూ. లక్ష వ్యయంతో మోటారు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటారు మరమ్మతులకు గురై నీటి సమస్య నెలకొన్నట్లు స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తక్షణం స్పందించి మోటారు ఏర్పాటు చేశామన్నారు. పంచాయతీ కార్యాలయంలో తప్పుపట్టిన వస్తువుల అమ్మకం ద్వారా రూ. 1,03,150 ఆదాయం వచ్చిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవో ప్రసాద్‌రెడ్డి, వార్డు మెంబరు మల్లికార్జునరెడ్డి, కుసుమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో పటిష్టంగా 'సివిల్ రైట్స్ డే'



మాట్లాడుతున్న తహసీల్దార్ కె. ధనుంజయలు

పీలేరురూరల్ : సివిల్ రైట్స్ డేని పటిష్టంగా అమలు చేయాలని తహశీల్దార్ కె. ధనుంజయలు అన్నారు. సోమవారం మండలంలోని బోడుమల్లువారిపల్లె దళితవాడలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ రైట్స్ డేలో సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. చట్టం దృష్టిలో అందరూ సమానులేనని, సమానత్వం పాటించడంలో అధికారులు కీలకపాత్ర పోషించాలని ఆదేశించారు. సివిల్ రైట్స్‌డేని దళిత గ్రామాల్లో ఓ ఉత్సవంలా నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేసు ఇచ్చిన వెంటనే నమోదు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించి మండలంలో ఇద్దరికీ రూ. 1.75 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఎంపీడీవో డాక్టర్ మురళీ మోహన్‌రెడ్డి, సీడీపీవో రాజమ్మ, సర్పంచ్ బి.సి. జయలక్ష్మీదేవి, ఈవోపీఆర్‌డీ జయమ్మ, ఏపీఎం లక్ష్మణ్‌రెడ్డి, ఎస్ఐ రమణ దళిత నాయకులు ధరణికుమార్, సుభాష్, భానుప్రకాష్, సుధాకర్, టి.ఎల్. వెంకటేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో 'స్మార్ట్' విద్యా బోధన

పెద్దతిప్పసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని స్థానిక తెలుగు హైస్కూల్ హెచ్‌ఎం అపర్ణాదేవి అన్నారు. డిజిటల్ విద్యా బోధన ప్రారంభమైన నేపథ్యంలో సోమవారం ఆమె మాట్లాడారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లను మించి సకల సౌకర్యాలతో సుందరంగా రూపుదిద్దుకున్నాయన్నారు. దీంతో పాటు 3,4,5 తరగతుల పిల్లలకు స్మార్ట్ టీవీ ద్వారా, 6 నుంచి 10వ తరగతి వరకు చదివే పిల్లలకు ఇంట్రాక్యూటివ్ ప్యానల్ బోర్డ్ (ఐఎఫ్‌పీ) ద్వారా విద్యా బోధన జరుగుతోందన్నారు. ఇప్పటికే స్మార్ట్ టీవీ, ఐఎఫ్‌పీ విద్యా బోధనలపై మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ పొందారని వివరించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తంబళ్లపల్లె: స్థానిక ఉన్నత పాఠశాలలో 1964–65 విద్యాసంవత్సరంలో ఎస్ఎస్ఎల్‌సి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం రోజు మల్లయ్యకొండపై కలుసుకున్నారు.58 ఏళ్ల తరువాత అప్పటి విద్యార్థులు అరుణమ్మ, జయరామ్‌రెడ్డి, సరస్వతి, శోభ, నాగమల్‌రెడ్డి, సయ్యద్, శివగంగ, కాంతమ్మ, సికెరెడ్డి, వెంకటరమణలు ఉన్నత ఉద్యోగాలలో పదవి విరమణ పొంది మల్లయ్యకొండను సందర్శించారు. స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

అల్లివంక ఆక్రమణలపై అధికారుల్లో కదలిక



ఆక్రమణలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

మదనపల్లె: అల్లివంక ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు కదిలారు.'అల్లి వంక చూడండి సారూ..' శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ మహబూబ్‌చాంద్ ఆదేశాల మేరకు మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం, వీఆర్వో మోహన్ తదితరులు అల్లివంక ఆక్రమణల వద్దకు చేరుకుని రెవెన్యూ రికార్డుల ప్రకారం పరిశీలించారు. మాదినికొండ నుంచి బసినికొండ పంచాయతీ విఘ్నేశ్వరకుంట పరిధి వరకు విస్తరించిన అల్లివంకను కొందరు వ్యక్తులు పూడ్చివేసి చదును చేస్తున్నారన్న ఫిర్యాదుల మేరకు విచారణ చేశారు. కేఎంఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో బసినికొండ పంచాయతీ సర్వే నెం.718–11లో 3.30 ఎకరాల విస్తీర్ణంకు సంబంధించి ఆనుకుని అల్లివంక వెళ్లే ప్రదేశాన్ని తనిఖీ చేశారు. సర్వేనెంబర్‌లో పూర్తిస్థాయి సర్వే నిర్వహించి అల్లివంక సరిహద్దులు తేలిన తర్వాతే స్థలం చదును పనులు చేపట్టాలని భూయజమానులను ఆదేశించారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

పీలేరు : విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పీలేరు పట్టణంలో నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షులు దేవరాజు, కన్వీనర్ ప్రసాద్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రేడ్–2 జెఎల్‌ఎంలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, అన్ లిమిటెడ్ మెడికల్ పాలసీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన గ్రేడ్–2 జెఎల్‌ఎంల కుటుంబాలకు ఉద్యోగం కల్పించాలని కోరారు. ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర, ఏడీ సుధాకర్, ఉద్యోగులు వరప్రసా ద్, శ్రీనివాసులు, రెడ్డెప్ప, శేఖర్‌బాబు, వాసుదేవనాయుడు, నారాయణ, శంకర, సుధాకర్‌నాయక్ పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

నిమ్మనపల్లె : వీఓఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణమ్మ, కార్యదర్శి రెడ్డెప్ప, జిల్లా అధ్యక్షులు రాణి డిమాండ్ చేశారు. సోమవారం నిమ్మనపల్లెలో వీఓఏల సమస్యలపై జీవుజాతా కార్యక్రమం నిర్వహించారు. వీఓఏల ఉపాధిని దెబ్బతీసే మూడేళ్ల కాలపరిమితిని రద్దుచేయాలని, గ్రామసమాఖ్యల విలీనాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. వేతనాలు నేరుగా వీఓఏల వ్యక్తిగత ఖాతాలకు జమచేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పరంజ్యోతి, జిల్లాకోశాధికారి సుబ్రహ్మణ్యం, సంఘమిత్రలు రాధ, నరేంద్ర, రెడ్డిప్రసాద్, రెడ్డెప్ప, జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


కంటి అద్దాలు పంపిణీ

కురబలకోట: దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు జగనన్న కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ఉచితంగా కంటి అద్దాలను అందజేస్తున్నట్లు మండల వైద్యాధికారి శ్రీధర్ అన్నారు. సోమవారం కురబలకోట జడ్పీ హైస్కూల్, చేనేతనగర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. హెడ్మాస్టర్ త్రివేణి, ప్రిన్సిపాల్ నీరజ, ఆప్తాలమిక్ అసిస్టెంట్ కనసాని రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

పల్లకీలో ఊరేగిన వీరభద్రుడు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి వీరభద్రస్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. అలాగే ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢ వీధులలో ఊరేగించారు. పల్లకీ సేవ ఆలయ పాలక మండలి అధ్యక్షరాలు పొలంరెడ్డి విజయ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఎస్సీ,ఎస్టీల అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి

తంబళ్లపల్లె: మండలంలో ఎస్సీ,ఎస్టీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, పేదరిక నిర్మూలనకు అహర్నిశలుగా కృషి చేస్తున్నారని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ సమావేశం జరిగింది. తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రస్తుతం మండలంలో సమగ్ర భూ సర్వే జరుగుతోందని ఎస్సీ, ఎస్టీలు తమ భూములకు సంబంధించిన పూర్తి వివరాలను సర్వే అధికారులకు తెలియజేసి సర్వే చేయించుకోవాలని సూచించారు. ఎంపీడీఓ సురేంద్రనాథ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమస్యలను గ్రామ సచివాలయాల ద్వారా పరిష్కరించుకునేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. అఖిలభారత బంజార సంఘం నాయకులు విజయ్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన తాండాలలో నేటికీ మౌళిక వసతులు, స్మశానవాటికల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నామని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం కల్పిస్తున్న విదేశీవిద్యాదీవెన ఎస్సీ,ఎస్టీలకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరుకల అభివృద్ధి సంఘం నాయకులు రఘుపతి, వెంకటరమణ మాట్లాడుతూ పరషతోపు కాలనీలో స్థలాల ఆక్రమణ గురించి వివరించారు. స్పందించిన తహసీల్దార్ ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటప్ప, బొజ్జప్ప మాట్లాడుతూ 15 దళితవాడలకు గాను కేవలం 9 దళితవాడలకు స్మశానవాటికలు చూపారని, మిగిలినవాటికి స్థలాలు చూపలేదన్నారు దళితులకు వ్యవసాయ భూ పంపిణీ చేయాలని కోరారు. డప్పు కళాకారులకు పెన్షన్ అందించాలన్నారు. ఈవిషయమై సోసల్ వెల్ఫేర్ అధికారులతో చర్చించి అర్హులైన డప్పు కళాకారులకు పెన్షన్ అందేలా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో త్యాగరాజు, డాక్టర్ అనుపమ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

మానవహక్కులపై అవగాహన

భారత రాజ్యాంగం కల్పించిన మానవహక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉన్నప్పుడే హక్కులు సాధించుకోగలరని తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం రెడ్డికోట పంచాయితీ దళితవాడలో మానవహక్కుల దినం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేంద్రనాథ్, ఎంఈవోత్యాగరాజు, ఆర్ఐ రవి, శ్రీరాములు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై 'బాస్' నిరసన



పెద్దతిప్పసముద్రంలో బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం: బీజేపీ పాలిత మణిపూర్ రాష్ట్రంలో గిరిజన మహిళలపై జరిగిన దారుణ, అమానుష ఘటనపై భారతీయ అంబేద్కర్ సేన (బాస్) నాయకులు సోమవారం స్థానిక బస్టాండ్‌లో శాంతియుతంగా నిరసన తెలిపారు. బాస్ నాయకులు కేవీ రమణ,సింగన్న మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మతోన్మాద కుల రక్కసి తాండవిస్తోందని మండిపడ్డారు. ముగ్గురు గిరిజన యువతులను వివస్త్ర చేసి నడ్డి రోడ్డులో ఊరేగించడమే గాక వారిపై సామూహిక అత్యాచారం జరిపి చంపడం అత్యంత హేయమైన చర్య అన్నారు. ఈ ఘాతుకానికి కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాట్నగల్లు రమణ,రామచంద్ర, గంగన్న, కదిరప్ప, రామప్ప, నరసింహులు, రామాంజులు, నాగరాజు, ఆంజినేయులు పాల్గొన్నారు.

ఉర్దూ సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలి

ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్



ద్వైమాసిక పత్రికను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

వాల్మీకిపురం: విద్యార్థి దశ నుంచే ఉర్దూ సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. సోమవారం ప్రసిద్ధ అంతర్జాతీయ ఉర్దూ కవి, రచయిత మహమూద్ షాహిద్ సారథ్యంలో ప్రారంభించిన అఫ్సానా నుమా ఉర్దూ కథానిక తొలి ద్వైమాసిక పత్రికను సోమవారం స్థానిక జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాషపై పట్టు సాధించేందుకు కథలు, సాహితీ పుస్తకాలను విద్యార్థులు చదవాలన్నారు. దీనివలన ఇతర పాఠ్యాంశాలను సులభతరంగా అవగాహన చేసుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఉర్దూ భాష అభివృద్ధికి రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నారని, ఇందులో భాగంగానే రాష్ట్రంలో ఉర్దూను ద్వితీయ అధికార భాషగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అలీఖాన్, కరీముల్లా, గుల్జార్ అహ్మద్, రోషన్ జమీర్, శంకరప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



తిరుమలరెడ్డిపల్లెలో కొలువుదీరిన పీర్లు

రామసముద్రం: మండలంలోని తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో మొహరం వేడుకలకు సోమవారం రాత్రి అంకురార్పణ చేశారు. పురాతన కాలం నుంచి ఏటా తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో మొహరం వేడుకలు వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. అంకురార్పణ రోజు నుంచి మూడు రోజులు, ఏడు రోజులు, తొమ్మిదవ రోజు వరకు తొమ్మిది రోజుల పాటు పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మత సామరస్యంగా , కులమతాలకతీతంగా హిందు, ముస్లింలు ఈ వేడుకలు నిర్వహిస్తారు. తిరుమలరెడ్డిపల్లె నుంచి ప్రత్యేక ప్రభలతో కూడిన పీర్లను ఊరేగిస్తారు. ఈ వేడుకలు చూడడానికి మండలంలోని ప్రజలే కాకుండా కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడ భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

సీడ్ పథకం నిధులు విడుదల చేయాలి



మదనపల్లెలో సమావేశమైన సంచార జాతులకు చెందిన నాయకులు

మదనపల్లె : సంచారజాతుల ఆర్థిక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీడ్ పథకం ద్వారా వెంటనే నిధులు విడుదల చేయాలని అఖిలభారత సంచారజాతుల అభివృద్ధి మండలి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు డి.పద్మనాభరాజు డిమాండ్ చేశారు. సోమవారం మదనపల్లెలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...దేశవ్యాప్తంగా ఉన్న సంచార జాతుల ఆర్థిక అభివృద్ధి కోసం కేంద్రప్రభుత్వం డీ నోటిఫైడ్ నోమడిక్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ (డీఎన్‌టీ) బోర్డు ఏర్పాటుచేసి ఐదేళ్లు అవుతున్నప్పటికీ నేటికీ ఒక రూపాయి విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎన్‌టీ బోర్డుకు ఇప్పటికే ఆన్‌లైన్ విధానంలో సంచార జాతులకు చెందిన పలువురు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారందరికీ రుణాలు విడుదల చేయాలని కోరారు. జీఎస్.మల్లయ్య, సుబ్రహ్మణ్యం, సామిరెడ్డి, లక్ష్మన్న, ఆంజనేయులు, గంగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోప్ స్కిప్పింగ్ పోటీల్లో పతకాల పంట



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ తదితరులు

మదనపల్లె : కర్నూలులో జూలై 29,30 తేదీల్లో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మదనపల్లె జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్ మాట్లాడుతూ తమ విద్యార్థినులు పద్మశ్రీ ఫ్రీస్టైల్, స్పీడ్ డబుల్ అండర్ రిలేలో రెండు బంగారు పతకాలను, జి.మానస ఒక బంగారు, ఒక వెండి పతకాన్ని సాధించారన్నారు. అలాగే ఆర్.భార్గవి ఒక బంగారు, ఒక రజత, సుప్రజ ఒక బంగారుపతకాన్ని, త్రిష రజత పతకాన్ని సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, పీడీ శరత్‌నాయక్ విద్యార్థులను అభినందించారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ మురళీ

మదనపల్లె : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలకు అధికారులు సత్వర పరిష్కారం చూపాలని ఆర్డీఓ ఎం.ఎస్. మురళీ ఆదేశించారు. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొత్త ఇండ్లు రంగారెడ్డి కాలనీ వాటర్‌ట్యాంకువీధి పరిసర ప్రాంతాల్లో నాటుసారా అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని, వీటిపై చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానికులు వినతిపత్రమిచ్చారు. ఎన్నికలకు సంబంధించి రాజకీయపార్టీగా తమకు సమాచారం ఇవ్వాల్సిందిగా బహుజన్‌సమాజ్‌పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెలగౌతమ్‌కుమార్ ఆర్డీఓకు వినతిపత్రమిచ్చారు. దేశంలో మూడో అతిపెద్ద జాతీయపార్టీ అయిన బీఎస్పీని ఎన్నికలసంఘ సమావేశాలకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. మున్సిపాలిటీలో జరిగిన స్పందన కార్యక్రమంలో కమిషనర్ కే.ప్రమీల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మోతీనగర్ సచివాలయం, మిషన్‌కాంపౌండ్, ఫైర్ ఆఫీసు, సుబ్బారెడ్డిలేఅవుట్ వద్ద వీధిదీపాలు వెలగడం లేదని గుండ్లూరురఫీ ఫిర్యాదుచేశారు. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిందిగా సిబ్బందిని కమిషనర్ కే.ప్రమీల ఆదేశించారు.

దారి సమస్య తీర్చాలని వినతి

కలికిరి: కలికిరి గ్రామ పంచాయతీ మదనపల్లి రోడ్డు సీఎల్ఆర్‌సీ కార్యాలయం సమీపంలోని జగనన్న కాలనీ దారి సమస్య తీర్చాలని కాలనీవాసులు సోమవారం తహశీల్దారు భాగ్యలతకు వినతిపత్రం అందచేశారు. కాలనీ ఎంట్రన్స్ వద్ద పట్టా భూమి ఉండటంతో యజమానులు దారి లేకుండా గాడి తవ్వారు. పక్కన గల ప్రభుత్వ స్థలం గుండా ప్రస్తుతం కాలని వాసులు వెళుతుండగా కొందరు ఆ స్థలాన్ని ఆక్రమించుకుని కట్టడాలు ప్రారంభిస్తుండటంతో కాలనీకి దారి సమస్య తలెత్తింది. ఫోన్ ద్వారా జిల్లా అధికారులకు స్పందన లో ఫిర్యాదు చేసిన కాలనివాసులు, అనంతరం తహశీల్దారుకూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి దారి సౌకర్యం కల్పించాలని కోరారు.

ఎస్ఈబీ దాడులు.. 23లీటర్ల సారా స్వాధీనం

మదనపల్లె : మదనపల్లె మండలంలోఎస్ఈబీ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు కేసుల్లో 23 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతో పాటుగా నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. మదనపల్లె–పొన్నూటిపాళ్యం మార్గంలో ఎర్రగానిపల్లెలో మండలంలోని నక్కలదిన్నెతాండాకు చెందిన సారా అమ్మకందారుడు బి.వెంకటరమణనాయక్ , కే.ఎం.సీ.తాండాకు చెందిన సారా తయారీ, సరఫరాదారుడు బి.మల్లికార్జుననాయక్‌ను అరెస్ట్ చేసి 8 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. రెండోకేసులో పట్టణంలోని కొత్త ఇండ్లు నుంచి కోటవారిపల్లెకు ఉన్న మట్టిరోడ్డులో ఎలకపల్లెకుంట గ్రామంలో సారా విక్రయిస్తున్న మున్సిపాలిటీ కొత్త ఇండ్లుకు చెందిన ఎం.మునెమ్మను, కోటవారిపల్లె తండాకు చెందిన తయారీ, సరఫరాదారుడైన ఎం .వెంకటరమణనాయక్‌ను అరెస్ట్‌చేసి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.